క్లుప్తంగా

జీజీహెచ్‌లో భద్రతపై సమీక్ష

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్, ఆర్ఎంసీలో భద్రతా చర్యలపై ఆస్పత్రి అధికారులు, పోలీసుల సంయుక్త సమీక్ష జరిగింది. సోమవారం ఉదయం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి బృందం జిల్లా ఎస్పీని కళాశాల, ఆస్పత్రిలో భద్రతా చర్యల పటిష్టతపై విన్నవించారు. తక్షణమే స్పందించిన ఆయన సాయంత్రం తమ బృందాన్ని పంపి ఆస్పత్రి అనుబంధ వివిధ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. డాక్టర్ లావణ్యకుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆస్పత్రి, ఆర్ఎంసీ హాస్టళ్లలో భద్రత అంశాలపై చర్చించారు. సీసీ కెమేరాల ఏర్పాటు, నిర్వహణను ప్రస్తావించారు. ఆస్పత్రిలో రోగులకు ఇబ్బంది లేకుండా అంతర్గత ట్రాఫిక్ నిర్వహణపై వివరించారు. ఆస్పత్రి అధికారులతో పాటు, ఆర్మ్‌డ్ రిజర్వు డీఎస్పీ చంద్రశేఖర్, వివిధ స్టేషన్ల సీఐలు పాల్గొన్నారు.

యూనిఫారమ్ అందజేత


కరపలో యూనిఫారమ్ అందుకున్న విద్యార్థినులు

కరప: సానా సతీష్‌బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ హైస్కూల్‌లోని ప్రభుత్వ ప్లస్ టు ఫస్టియర్ విద్యార్థినులు 25 మందికి సోమవారం రెండు జతల వంతున యూనిఫారమ్ పంపిణీ చేశారు. సంస్థ చైర్మన్ తలాటం హరీష్, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, వివిధ పార్టీల నాయకులతో కలిసి దుస్తులను అందజేశారు. విద్యార్థినులకు యూనిఫారమ్ అందజేయాలని మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు ఫౌండేషన్ వారిని కోరగా, చైర్మన్ హరీష్ స్పందించి యూనిఫారమ్ సమకూర్చారు. చైర్మన్ హరీష్ మాట్లాడుతూ విద్యార్థినుల చదువు కోసం తమ ఫౌండేషన్ ద్వారా ఆర్థికసాయం అందిస్తామన్నారు. విశ్రాంత మున్సిపల్ కమిషనర్ వి.చక్రధరరావు, హెచ్ఎం ఎం.శ్రీనివాసరావు, ఎస్ఎంసీ చైర్మన్ దేవు దుర్గారావు, ముమ్మిడి వెంకటేష్ పాల్గొన్నారు.

వేంకటేశుని జన్మ నక్షత్ర పూజలు

కరప: యండమూరులో ఉన్న సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి జన్మ నక్షత్రం శ్రవణం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి, ప్రధానార్చకుడు పెద్దింటి సీతారామం, వేద పండితులతో కలిసి పూజాదికాలు చేశారు. భక్తులతో వేంకటేశ్వర స్వామి వ్రతాలు నిర్వహించారు. భక్తుల ఆర్థిక సహకారంతో అన్న ప్రసాద వితరణ చేశారు. కరప విష్ణ్వాలయంలోని వేంకటేశ్వరస్వామికి అర్చకుడు పెద్దింటి అనంతాచార్యులు, కూరాడ, పెనుగుదురు, గురజనాపల్లి, వేళంగి తదితర గ్రామాల్లోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో స్వామివారికి జన్మనక్షత్ర పూజలు జరిగాయి.

బోగస్ ఓట్లు తొలగించాలి

బోట్‌క్లబ్: ఇంటింటి ఓటరు సర్వేలో బోగస్ ఓట్లు తొలగించాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు అధికారులను కోరారు. ఆగస్టు 20 నుంచి అక్టోబర్18 వరకు ఇంటింటి సర్వే, అక్టోబర్ 19 నుంచి 28 వరకు అభ్యంతరాలు, నవంబర్ 23న ముసాయిదా జాబితా, డిసెంబర్ 24లోగా పరిష్కారాలు వహించే రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రక్రియలో స్థానికంగా పోలింగ్ కేంద్రాల ఇంటి నంబర్‌లో నివాసం లేని వ్యక్తుల కుటుంబాల పేర్లు తొలగించాలని సోమవారం ఒక ప్రకటనలో కోరారు . 2025 జనవరి ఒకటిలోగా సిద్ధం చేసే తుది జాబితాలో అవకతవకలు పూర్తిగా సరిదిద్దాలన్నారు.

వాసవీ సంఘ అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం

కాకినాడ: వాసవీ సేవా సంఘం అధ్యక్షునిగా తేలుగుంట సుబ్రహ్మణ్యం ఎన్నికయ్యారు. సంఘ సర్వసభ్య సమావేశం సోమవారం స్థానిక బాలాజీచెరువు సెంటర్‌లోని సామాజిక భవనంలో జరిగింది. ఎన్నికల అధికారిగా లింగమల్లు కృష్ణమూర్తి వ్యవహరించారు. అధ్యక్షునిగా టి.సుబ్రహ్మణ్యం, కార్యదర్శిగా ఆకే వెంకటేశ్వరరావు, కోశాధికారిగా శ్రీకాకుళపు సాయిరామ్, ఉపాధ్యక్షులుగా దేవత పుత్రరావు, గ్రంధి సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శిగా బండారు శ్రీనివాసరావు, పీఆర్వోగా దొంతన రామకృష్ణ ఎన్నికయ్యారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో జైలు, జరిమానా విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్-1, త్రీ టౌన్, తిమ్మాపురం, టూటౌన్, ఇంద్రపాలెం, సర్పవరం, కరప, పోర్ట్ పోలీసు స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. వీరిని సోమవారం కోర్టులో హాజరుపర్చగా, 9 మందికి రెండు రోజుల వంతున జైలు,, మరొకరికి వారం రోజుల జైలు, 43 మందికి రూ.10 వేల వంతున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

మరో కోర్టులో..

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ఒకరికి రెండు రోజుల జైలు, పది మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ ఒకటో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ హెచ్.వీరభద్రుడు తీర్పు చెప్పారు. తాళ్లరేవు మండలం కోరింగి, పెదపూడి, వన్ టౌన్ పోలీసు స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. సోమవారం వారిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి శిక్ష విధించారు.

కష్టాల్లోనే సాగుతూ..!

- రైతులకు అందని ద్రాక్షగా పెట్టుబడి సాయం
- ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న వెదజల్లు పంట
- తిరిగి నాట్లు వేయడంతో అదనపు భారం
- వరి చేలకు పొంచి ఉన్న ఎలుకల బెడద


పండూరులో వర్షాలకు వెదజల్లు వరి చేను దెబ్బతినడంతో, మళ్లీ నాట్లు వేసే పనుల్లో నిమగ్నమైన రైతులు

కాకినాడ రూరల్: సాగుబడిని నమ్ముకుని, అరుగాలం శ్రమిస్తూ పంటలు పండించి, తిండి గింజలను సమకూర్చే రైతన్నలకు కష్టాలు వెన్నాడుతూనే ఉన్నాయి. ఎంతో ఉత్సాహంతో ఖరీఫ్ సాగును చేపట్టిన రైతులకు ఆదిలోనే హంసపాదు అన్నట్టు వెదజల్లు చేలపై ఇటీవల తుపాను తీవ్ర ప్రభావం చూపింది. అధిక వర్షాలకు వెదజల్లు చేలు దెబ్బతినడంతో, గత్యంతరం లేక కొందరు రైతులు దమ్ములు చేసి నాట్లు వేసుకుంటున్నారు. తద్వారా సుమారు రూ.4 వేల వరకు రైతులపై అదనపు భారం పడుతోంది.

కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని కాకినాడ రూరల్, కరప మండలాల్లో సుమారు 19,100 ఎకరాల్లో వరి సాగవుతోంది. గోదావరితో పాటు, ఏలేరు కింద ఆయకట్టు ఉంది. గోదావరి ఆయకట్టులో ముందుగానే నాట్లు వేశారు. ఏలేరు కింద ఇంకా నాట్లు పడుతున్నాయి. శివారు ఆయకట్టులో నాట్లు పూర్తి కాలేదు. కాకినాడ రూరల్‌లో ఏలేరు కింద తిమ్మాపురం, పండూరు, పి.వెంకటాపురం, తమ్మవరం, పెనుమర్తి, నేమాం తదితర గ్రామాల్లో సాగవుతుండగా, గోదావరి జిల్లాల్లో సర్పవరం, చీడిగ, రేపూరు, కొవ్వాడ, గంగనాపల్లి, కొవ్వూరు, తూరంగి తదితర గ్రామాలు సాగవుతున్నాయి. పండూరు తదితర గ్రామాల్లో వెదజల్లు పద్ధతిలో సాగు చేపట్టిన చేలు దెబ్బతినడంతో రైతులు నాట్లు వేసే పద్ధతిలో తిరిగి సాగు చేపట్టారు. మండలంలో 13 రైతు సేవా కేంద్రాల ద్వారా వ్యవసాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో ఎరువులు సరఫరా చేపడుతున్నారు.

సాగు రకాలివే..

ఈ వ్యవసాయ సీజన్‌లో ఎక్కువ మంది రైతులు ఎంటీయూ 7029(స్వర్ణ) రకం వరి వంగడం వైపు మొగ్గు చూపారు. 60 శాతం ఆయకట్టులో స్వర్ణ రకం సాగు చేపట్టగా, పది శాతం బీపీటీ 5204, పది శాతం ఎంటీయూ 1318, ప్రైవేట్ వరి వంగడాలను 20 శాతం సాగు చేస్తున్నారు.

ఏదీ భరోసా..?

వ్యవసాయం చేసే అన్నదాతలకు ఆసరాగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పీఎం కిసాన్‌తో కలిపి రూ.13,500 పెట్టుబడి సాయంగా ఇచ్చేవారు. కౌలు రైతులకు పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం నుంచే అందించేవారు. ఏటా మే నెలలోనే పెట్టుబడి సాయం మొదటి విడత అందించి అన్నదాతలను ఆదుకునేవారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇవ్వాల్సి ఉంది. కానీ దీనిపై ఇప్పటికీ రైతులకు ఎటువంటి భరోసా లేదు. దీంతో రైతన్నలు అసంతృప్తితో ఉన్నారు. తక్షణమే పెట్టుబడి సాయం అందించాలని అన్నదాతలు కోరుతున్నారు.

ఎలుకల బెడద

ముందుగా నాట్లు వేసినా, వెదజల్లు సాగు చేపట్టినా వరిచేలు ఏపుగా పెరుగుతుండడంతో ఎలుకల బెడద ఎక్కువగా ఉన్నట్టు రైతులు చెబుతున్నారు. దుబ్బులను కట్ చేస్తుండడంతో నష్టం వాటిల్లుతున్నట్టు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎలుకల నిర్మూలన సామూహికంగా చేపట్టడంతో పాటు, రైతులకు అవగాహన కల్పించాల్సి ఉంది.

అక్కడక్కడా నష్టం గుర్తింపు

కాకినాడ రూరల్ నియోజకవర్గం పరిధిలో దాదాపుగా నాట్లు పూర్తయ్యాయి. ముందుకు నాట్లు వేసిన చేలలో ఎలుకల బెడద ఉన్నట్టు రైతులు తమ దృష్టికి తీసుకువచ్చారు. వీటి నిర్మూలన చర్యలు త్వరలో ప్రారంభిస్తాం.

– ప్రశాంతి, ఇన్‌చార్జి ఏడీఏ, కాకినాడ రూరల్

దెబ్బతిన్న వెదజల్లు చేలు

ఇటీవల అధిక వర్షాల వల్ల వెదజల్లు పద్ధతిలో సాగు చేపట్టిన చేలు దెబ్బతిన్నాయి. గత్యంతరం లేక వెదజల్లు పద్ధతిని నిలిపి, దమ్ములు చేసి నాట్లు వేస్తున్నాం, విత్తనాలు, ఎరువులు, కూలీల సొమ్ములు కలిపి సుమారు రూ.4 వేల వరకు నష్టపోయాం.

– నందిపాటి ధర్మరాజు, రైతు, పండూరు

సకాలంలో సమస్యల పరిష్కారం

గ్రీవెన్స్‌లో కార్పొరేషన్ కమిషనర్ భావన


మహిళ నుంచి అర్జీ స్వీకరిస్తున్న కమిషనర్ భావన

కాకినాడ: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా వచ్చిన ప్రతి ఒక్క సమస్యను సత్వరమే పరిష్కరించాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఆదేశించారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 9:30 నుంచి 10:30 వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని, అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను కమిషనర్ నిర్వహించారు. డయల్ యువర్ కమిషనర్ ద్వారా ఇంజినీరింగ్, ప్రజారోగ్యం, టౌన్ ప్లానింగ్, యూపీఏ విభాగాలకు సంబంధించి 18 మంది ఫోన్ల ద్వారా సమస్యలు విన్నవించారు. ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ భావన అక్కడే ఉన్న అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో భాగంగా నరపాలక సంస్థ కార్యాలయంలో నేరుగా ప్రజల నుంచి కమిషనర్ వినతులు స్వీకరించారు. ఫ్రెండ్స్ కాలనీ పార్కులో వాకర్స్‌కు అనువైన సౌకర్యాలు కల్పించాలని కొందరు, వైఎస్సార్ ఫ్లై ఓవర్ కింద ఆకతాయిల ఆగడాలు.. ఇలా వివిధ అంశాలపై వినతులు కమిషనర్‌కు అందాయి. ప్రజలు ఇచ్చిన వినతులను స్వయంగా తీసుకుని, వాటి పరిష్కారానికి ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్క విజ్ఞాపనకు నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.సత్యకుమారి, స్మార్ట్ సిటీ ఎస్ఈ వెంకటరావు, ఈఈ మాధవి, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, డీసీపీ హరిదాస్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఉద్యాన సహాయ సంచాలకులు టీవీ శిరీల్, పలువురు డీఈలు, ఏఈలు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

కార్పొరేషన్ కమిషనర్ భావన ఆదేశం



గృహ నిర్మాణ పురోగతిపై అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ భావన

కాకినాడ: గృహ నిర్మాణాలకు సంబంధించి నిర్దేశించిన వంద రోజుల లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు కృషి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన అధికారులు, లేబర్ ఏజెన్సీలను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం మెప్మా, హౌసింగ్ తదితర శాఖల అధికారులతో సమావేశమయ్యారు. కొమరగిరి లే అవుట్‌లో గృహ నిర్మాణాలపై సమీక్షించారు. అక్కడ ఎన్ని ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి, ఎంత మంది పూర్తి చేసుకున్నారు, ఇంకా ఎంత మంది పూర్తి చేయాల్సి ఉంది.. వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది అక్టోబర్ చివరి నాటికి వీటన్నింటినీ పూర్తి చేయాలని సూచించారు. మొత్తం 1,103 ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి వంద రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లో పనుల్లో జాప్యం లేకుండా చూడాలని, అనుకున్న లక్ష్యాన్ని పూర్తి చేయాల్సిందేనని స్పష్టం చేశారు .ఇళ్ల లబ్ధిదారులు వాటా సొమ్ము ఇవ్వకపోవడం వల్లే నిర్మాణంలో జాప్యం జరుగుతోందని లేబర్ ఏజెన్సీల నిర్వాహకులు తెలిపారు. దీనిపై కమిషనర్ స్పందించి లబ్ధిదారులకు ఈ విషయమై అవగాహన కల్పించాలని కోరారు. అలాగే రోడ్లు, డ్రెయిన్లు, ఇతర మౌలిక వసతుల ఏర్పాట్లపైనా దృష్టి సారించాలని కమిషనర్ తెలిపారు. బేస్‌మెంట్ లెవెల్లో ఉన్న గృహాలను పూర్తి చేయించే బాధ్యత కూడా అధికారులదేనన్నారు. హౌసింగ్ పీడీ, డిప్యూటీ కలెక్టర్ ఏవీవీ సత్యనారాయణ, ఈఈ వై.శ్రీనివాస్, డీఈఈ కేఎస్ఏఎం రెడ్డి, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ డి.వెంకట్రాజు, ఇన్‌చార్జి టీపీఆర్ఓ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

తురగా సూర్యారావుకు సత్కారం


తురగా సూర్యారావును సత్కరిస్తున్న పోస్టల్ ఉద్యోగులు

బోట్‌క్లబ్: ఎస్వీ రంగారావు కళా ప్రవంతి పదో వార్షికోత్సవం సందర్భంగా ప్రముఖ రంగస్థల నటుడు, రిటైర్డు పోస్టల్ ఉద్యోగి డాక్టర్ తురగా సూర్యారావు ఎస్వీఆర్ కళా పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక హెడ్ పోస్టాఫీసులో సూర్యారావును హెడ్ పోస్ట్‌మాస్టర్ వెంకటేశ్వరరావు, యూనియన్ నాయకులు జి.అనితకుమారి. పి.సాగర్, కె.ప్రసాదరావు. కె.శ్రీనివాసరావు, అన్నపూర్ణేశ్వరావు సత్కరించారు. ఆయన మరెన్నో అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు.

వైద్యురాలిపై అఘాయిత్యానికి నిరసనగా మానవహారం


వైద్యురాలిపై అఘాయిత్యాన్ని నిరసిస్తూ ఇంద్రపాలెంలో కొవ్వొత్తులు చేతపట్టి నిర్వహించిన మానవహారం

కాకినాడ రూరల్: కోల్‌కతా ట్రైనీ వైద్యురాలిపై జరిగిన అఘాయిత్యం ఘటనపై కాకినాడ రూరల్ ఇంద్రపాలెం అల్లూరి సెంటరులో ప్రజలు భారీఎత్తున నిరసన వ్యక్తం చేశారు. కొవ్వొత్తులను చేతపట్టిన నిరసనకారులు ఆదివారం రాత్రి మానవహారం నిర్వహించారు.,మరణించిన వైద్యురాలి చిత్రపటానికి నివాళులర్పించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, మన ఊరు–మన బాధ్యత స్వచ్ఛంద సంస్థ, పౌర సంక్షేమ సంఘం, ఐద్వా, వివిధ సంఘాల వారు, న్యాయవాది వసంత, రచయిత్రి అద్దేపల్లి జ్యోతి, యూటీఎఫ్ నాయకురాలు సోని, మేడిశెట్టి రామ్మోహన్, బాబ్జీ, విజయకుమార్ తదతరులు పాల్గొన్నారు.



వైద్యురాలి హత్య సంఘటనకు నిరసనగా ర్యాలీ చేస్తున్న ముస్లింలు

ముస్లింల నిరసన ర్యాలీ

కాకినాడ: కోల్‌కతాలో ఓ వైద్యురాలిని అత్యంత కిరాతకంగా హతమార్చిన ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ముస్లింలు సోమవారం కాకినాడలో నిరసన ప్రదర్శన చేశారు. మెయిన్ రోడ్డులోని జామియా మసీదు నుంచి ఈ ర్యాలీ చేపట్టారు. నిందితులను శిక్షించాలని నినాదాలు చేశారు. జామియా మసీదు అధ్యక్షుడు ఇజాజుద్దీన్ మాట్లాడుతూ దేశంలో మరిన్ని కఠినమైన చట్టాలు రావాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. సౌదీలో అమలు జరుగుతున్న కఠిన చట్టాలు, శిక్షలు ఇక్కడ కూడా అమలు అయినప్పుడే నేరాలు తగ్గుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పలు మసీదుల ఇమామ్‌లు, మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమ్మెకాల వేతనాలు ఇవ్వాలని ధర్నా

హెల్త్ ఆఫీసర్‌కు పారిశుధ్య కార్మికుల వినతిపత్రం



సమ్మెకాల వేతనాలు అమలు చేయాలంటూ ధర్నా చేస్తున్న కార్మికులు

కాకినాడ సిటీ: నగరపాలక సంస్థలో పనిచేస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సంఘ కాకినాడ కమిటీ అధ్యక్షుడు బొబ్బిలి శ్రీనివాసరావు నాయకత్వంలో జరిగిన ఈ ధర్నాను ఉద్దేశించి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ ప్రసంగించారు. కాకినాడ కార్పొరేషన్‌లో పని చేస్తున్న కాకినాడ స్పెషల్ శానిటేషన్ వర్కర్లు, టాయ్‌లెట్ వర్కర్లు, జనవరిలో అదనంగా తీసుకున్న నూతన సిబ్బందికి ఆరు నెలలుగా బకాయి వేతనాలు చెల్లించడం లేదని చెప్పారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో జీతాలు మంజూరు చేయకపోతే కార్మికులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఆప్కాస్ కార్మికులకు రాష్ట్ర అంతటా జీతాలు మంజూరైనా, కాకినాడలో ఇంకా మంజూరు కాలేదన్నారు. కేవలం మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా జీతాల చెల్లింపులో జాప్యం అవుతుందన్నారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలపై స్పందించాలన్నారు. గతంలో ఆదివారాలు పనిచేసినా, సమ్మెకాల వేతనాలు మంజూరు కాలేదన్నారు. పండగ సెలవులు పారిశుధ్య కార్మికులకు పూర్తిస్థాయిలో అమలు చేయాలని, నైట్ శానిటేషన్ కార్మికులకు తొట్టి రిక్షాలు రిపేరు చేయించి, కొత్తవి మంజూరు చేయాలని, గ్లౌజులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ పృథ్వీచరణ్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘ నాయకులు తుపాకుల లక్ష్మీనారాయణ, బంగారు రాజేష్, సింగంపల్లి రమణ, కొలు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమ పూజలు

కరప: గ్రామ దేవత ఉప్పాలమ్మ తల్లి ఆలయంలో సోమవారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. కరప, పరిసర గ్రామాల నుంచి సుమారు 1,500 మంది మహిళలు కుంకుమ పూజలకు హాజరు కాగా, వేద పండితులు పూజలు చేయించారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేసి, భక్తులకు భోజన వసతి కల్పించారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ చిన్నారి మురళీకృష్ణ సభ్యులు గొర్రెల శ్రీనివాస్, దేవు వీరబాబు పర్యవేక్షించారు.

విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథం ఉండాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ రమేష్

కాకినాడ రూరల్: సమాజానికి ఉపయోగపడే ఆలోచనలతో పాటు, విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథం ఉండాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ అన్నారు. పండూరు జెడ్పీ హైస్కూల్‌లో ఫిజికల్ సైన్స్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశం సోమవారం నిర్వహించారు. సైన్స్ ఆఫీసర్ వినీల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డీఈఓ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులను భావి సైంటిస్టులుగా తీర్చిదిద్దవలసిన బాధ్యత సైన్స్ ఉపాధ్యాయులపై ఉందన్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యార్థులు అందరూ ఉత్తీర్ణులు అయ్యేలా నేటి నుంచి కృషి చేయాలన్నారు. మధ్యాహ్న భోజనం పాఠశాలల్లో చేసేలా చూడాలని సూచించారు. స్కూల్ కాంప్లెక్స్ నిర్వహణ పాఠశాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. కాకినాడ రూరల్, కాకినాడ టౌన్, సామర్లకోట, పెదపూడి మండలాల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు 70 మంది హాజరయ్యారు. డీఈఓ వెంట పాఠశాల హెచ్ఎం ఈ.సూర్యప్రకాశిని ఉన్నారు.

ఘనంగా సంతోషి మాత ఉత్సవాలు


సంతోషి మాతకు కుంకుమ పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

బోట్‌క్లబ్: సంతోషిమాత అమ్మవారి జన్మ నక్షత్రం సందర్భంగా స్థానిక భరతమాత సెంటర్‌లో ఉన్న సంతోషిమాత ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, సామూహిక సౌభాగ్య సుహాసిని లక్ష కుంకుమార్చన పూజలు భక్తిశ్రద్ధలతో చేశారు. తొలుత గోపూజతో ఉత్సవాలను ప్రారంభించారు. ఆలయ ప్రధానార్చకులు మంధా ముత్యాల మురళీశర్మ ఆధ్వర్యంలో ఈ ఏడాది భారీ స్థాయిలో ఉత్సవాలను నిర్వహించారు. సాయంత్రం వేద పండితుల ఆధ్వర్యంలో శైవాగమ విధానంతో పంచగవ్యం మహాన్యాస పూర్వకంగా హోమాలను కమిటీ సభ్యులు కుటుంబ సమేతంగా నిర్వహించారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు మరడ బాలాజీ, అధ్యక్షుడు కిషన్ గోపాల్ తివారి, ప్రతినిధులు పుప్పాల నరసింహారావు, జామి సాయిప్రసాద్ యాదవ్, చుక్క అప్పలరాజు, బోడవరపు వీరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఘన సత్కారం


కరపలో ఉద్యోగులను సత్కరిస్తున్న ఎంపీపీ శ్రీలక్ష్మి, ఎంపీడీఓ అప్పారావు తదితరులు

కరప: పదోన్నతి పొందిన, ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న ఉద్యోగులను స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ, ఎంపీడీఓ, కార్యదర్శులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. కరప, గురజనాపల్లిలో గ్రామ కార్యదర్శిగా పనిచేస్తున్న ఎస్కే నాగేంద్రకుమార్‌కు గ్రేడ్–1 కార్యదర్శిగా పదోన్నతి లభించింది. మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న టి.సురేష్ ఈ ఏడాది ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. వీరికి ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, ఎంపీడీఓ కె.అప్పారావు, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, ఏఓ గుత్తుల భీమశంకరరావు, ఈఓపీఆర్డీ బీఏ సత్యనారాణ, గ్రామకార్యదర్శులు వి.సునీల్ కుమార్, పెంకే సత్తిబాబు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.

అనురాగానికి ప్రతీక రక్షా బంధన్

కాకినాడ రూరల్: అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనురాగానికి ప్రతీక రాఖీ పండగను రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. తమకు రాఖీలు కట్టిన సోదరీమణులకు సోదరులు నూతన వస్త్రాలను, వివిధ బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ప్రతినిధి కృష్ణమోహన్, ఆధ్యాత్మిక వేత్త రవిశంకర్ పట్నాయక్, డాక్టరు అద్దాల సత్యనారాయణ, అడబాల రత్నప్రసాద్ తదితరులు రాఖీ పండగ విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమంలో సభ్యులు చింతపల్లి సుబ్బారావు, ప్రసాద్, రాజా, రేలంగి బాపిరాజు, ఓం నమశ్శివాయ, సత్యనారాయణ, శ్రీనగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయానుబంధానికి నిదర్శనం

కరప: సోదరీ, సోదరుల ఆత్మీయానుబంధాన్ని బలోపేతం చేసే రక్షాబంధన్ (రాఖీ) పండగను సోమవారం మండలంలోని గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. పిల్లల నుంచి పెద్దల వరకు వయోబేధం లేకుండా, ఈ పండగను అట్టహాసంగా జరుపుకొన్నారు. తోబుట్టువులతో రక్షాబంధనం కట్టించుకున్న సోదరులు కానుకలు ఇచ్చారు. దూర ప్రాంతాల్లో ఉన్న అన్నాచెల్లెళ్లు,, అక్కాతమ్ముళ్లు ఒకరికొకరు ఫోన్లలో మాట్లాడుకుని శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. చిన్నారులు రాఖీలు చేతపట్టుకుని వీధుల్లో తిరుగుతూ సందడి చేశారు.

మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కె.అప్పారావు,, ఈఓపీఆర్డీ బీఏ సత్యనారాయణ, ఏపీఓ జీవీ రమణకుమార్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి రాఖీలు కట్టి, స్వీట్లు తినిపించారు. పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి వి.సునీల్‌కుమార్ ఇతర సిబ్బందికి సర్పంచ్ సాదే ఆశాజ్యోతి రాఖీ కట్టి, శుభాకాంక్షలు తెలిపారు. కరపలో పలువురు టీడీపీ నాయకులకు మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి రాఖీ కట్టారు.

కాకినాడ సిటీ: వైఎస్సార్ సీపీ కాకినాడ అర్బన్ కార్యాలయంలో సోమవారం రక్షా బంధన్ వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డికి అర్బన్ పార్టీ అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, కుడా మాజీ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి రాఖీలు కట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అదేవిధంగా కార్యాలయంలో పలువురు నాయకులకు రాఖీలు కట్టారు.


మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడికి రాఖీ కడుతున్న సుంకర శివప్రసన్న


మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడికి రాఖీ కడుతున్న రాగిరెడ్డి చంద్రకళాదీప్తి


రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో రాఖీ వేడుకలు


కరపలో ఎంపీడీఓ అప్పారావుకు రాఖీ కడుతున్న ఎంపీపీ శ్రీలక్ష్మి

ఘనంగా శ్రావణ పౌర్ణమి పూజలు


గురజనాపల్లిలో షిరిడీ సాయిబాబాకు హారతి ఇస్తున్న పండితుడు

కరప: శ్రావణ మాసం పౌర్ణమి సందర్భంగా సోమవారం షిరిడీ సాయిబాబా మందిరాల్లో పూజాది కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. నడకుదురు, గురజనాపల్లి, వేళంగి, సిరిపురం, వేములవాడ, కొరుపల్లి, పెద్దాపురప్పాడు, గొడ్డటిపాలెం గ్రామాల్లోని షిరిడీ సాయి మందిరాల్లో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. కొన్ని మందిరాల్లో కాకడ హారతి, సత్యవ్రతాలు, పల్లకీసేవ నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని సాయి భక్తులు స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో జంధ్యాల పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. బ్రాహ్మణులతో పాటు, వివిధ సామాజిక వర్గీయులు లక్ష్మీదేవి వద్ద జంధ్యాలను ఉంచి. నియమ, నిష్ఠలతో ప్రత్యేక పూజలు చేసి జంధ్యాలను మార్చుకున్నారు. మహిళలు దుర్గాదేవికి పూజలు చేశారు.